ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శుక్రవారం 29 నవంబరు 2024 | 5





మోరి జీడిపప్పు అచ్చుల టేస్టే వేరు
తింటే మర్చిపోరు..
6లో

ఫెంగల్ తుఫాన్ హెచ్చరికలతో

రైతులు అప్రమత్తం

పంట ఒబ్బిడి, మిల్లులకు ధాన్యం తరలింపు పనులతో బిజీబిజీ





అంబాజీపేట మండలం గంగలకుర్రులో ధాన్యాన్ని ఎండబెడుతున్న రైతులు

అంబాజీపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు కోతలు, ధాన్యం ఎగరబోత, అరబోత, మిల్లులకు తరలింపులో బిజీబిజీగా ఉన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే పరిస్థితి ఉందని అధికారులు అప్రమత్తం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడటంతో హడావిడిగా మాసూళ్లు, పట్టుబడులు పూర్తి చేసి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి 1.57 లక్షల ఎకరాలలో సాగు చేశారు. ప్రస్తుతం 90 వేల ఎకరాలలో కోతలు పూర్తి అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మండపేట, రాయవరం, రావులపాలెం, ఆత్రేయపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలలో దాదాపుగా కోతలు పూర్తికాగా, అంబాజీపేట, పి.గన్నవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, రాజోలు, మలికిపురం, మామిడికుదురు, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర మండలాల్లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు రైతులు కోతలు కోయవద్దని అధికారులు ఇప్పటికే రైతులను అప్రమత్తం చేస్తున్నారు. వర్షం వస్తే కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచిస్తున్నారు. కోత దశలో ఉన్న వరిపైరు పడిపోతే నిలబెట్టుకోవాలని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం తప్పదని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరతపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పరిశీలించారు. ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వ్యవసాయశాఖ, రెవెన్యూ సిబ్బంది రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఏవో సీహెచ్‌డీ విజయ కుమార్, ఏఈవో డి.దుర్గారావు, వ్యవసాయా శాఖ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు..

తీరంలో అలజడి

ఎగసిపడుతున్న అలలు

కోతకు గురవుతున్న భూమి



కోతకు గురైన తీరం

అల్లవరం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న రాకాసి అలలు తీరభూమిని కబళిస్తూ అంతకంతకూ ముందుకు చొచ్చుకువస్తున్నాయి. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలల తీవ్రతతో సముద్ర తీరం వెంబడి కిలోమీటర్ పొడవునా తీరభూమి సముద్ర గర్భంలో కలిసిపోయింది. ఓడలరేవు తీరంలో గతంలో ఆక్వాచెరువులకు వేసిన ఉప్పునీటి బోరుపైపులు బయటపడ్డాయి. గడిచిన 25 ఏళ్లలో సుమారు 800 మీటర్ల వెడల్పునా తీరభూమి కనుమరుగై క్రమేపీ సముద్రం ముందుకు వచ్చింది. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్ సమయాలలో అలల ఉధృతితో తీరం వెంబడి ఉన్న అటవీ శాఖకు చెందిన సుమారు 160 ఎకరాల తీరభూమి, రైతులకు చెందిన వందల ఎకరాల జిరాయితీ భూములలో కొబ్బరి తోటలు, సరుగుడు తోటలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. సముద్ర తీర ప్రాంత నివారణకు ఇటు ప్రభుత్వాలు గాని, అటు ఓఎన్జీసీ సంస్థ గాని ఎటువంటి రక్షణ తీసుకోకపోవడంతో ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్స్‌కు, ఓడలరేవు, కొమరగిరిపట్నం తీర గ్రామాలకు ముంపు పొంచి ఉంది. సముద్ర తీరంలో సరుగుడు తోటలు నరికివేయడంతో పాటు ఇసుక తవ్వకాలు, తీరంలో ఆక్వా చెరువుల వల్ల తీర గ్రామాలలో రక్షణ ప్రశ్నార్థకంగా మారింది.



ఎగసిపడుతున్న అలలు



గోదారి.. మారుతుందోచ్!

అఖండ గోదావరికి పర్యాటక కళ

- పర్యాటక నిధుల ప్రవాహం
- తొలి విడతగా రూ.62 కోట్లు
- మారనున్న హేవలాక్ వంతెన
- ఇక మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్
- ఆధ్యాత్మిక కేంద్రంగా పుష్కరఘాట్
- కడియం నర్సరీలకు శోభ
- విజ్జేశ్వరం కాలువలో బోట్ షికార్
- త్వరలో టెండర్లు ఆహ్వానం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరికి పర్యాటక కళ రానుంది. వచ్చే పుష్కరాలకు హేవలాక్ బ్రిడ్జి, పుష్కర ఘాట్, కడియం నర్సరీలు, విజ్జేశ్వరం-నిడదవోలు కాల్వ, కోటసత్తెమ్మ గుడి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందనున్నాయి. అఖండ గోదావరి ప్రాజెక్టుకు రూ.94.44 కోట్లు మంజూరుకాగా అందులో కేంద్ర ప్రభుత్వం స్పెషల్ అసిస్టెంట్స్ టు స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ (సాస్కి) పథకం కింద రూ.62 కోట్లు విడుదలచేసింది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కృషితో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందనుంది.



హేవలాక్ ఇలా...



కడియం దారిలో

హేవలాక్ బ్రిడ్జి

రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య గోదావరిపై నిర్మించిన మొదట రైల్వే బ్రిడ్జిని మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. 127 ఏళ్ల ఈ బ్రిడ్జిని చారిత్రక కట్టడంగా తీర్చిదిద్దాలని ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారు. ఈ మేరకు రెండు దశాబ్దాల కిందట అప్పట్లో సీఎం చంద్రబాబు చొరవతో రైల్వేశాఖకు రూ.10 కోట్లు చెల్లించి బ్రిడ్జిని స్వాధీనం చేసుకున్నారు. గత పుష్కరాల సమయంలో అప్పటి సీఎంగా చంద్రబాబు అఖండగోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జి, గోదావరి లంకలు, ఘాట్లు అభివృద్ధి చేయాలని ప్రయత్నించారు. రూ.100 కోట్లు కేటాయించారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి రీజనల్ కార్యాలయం ఏర్పాటుచేశారు. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అఖండ గోదావరి ప్రాజెక్టును ఎత్తేసింది. పర్యాటక కళలను ధ్వంసం చేసింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో అఖండ గోదావరికి మళ్లీ జీవంపోసింది. 2,700 మీటర్ల పొడవుతో 18 స్పాన్స్‌తో ఉన్న హేవలాక్ బ్రిడ్జిని సాసి పథకం కింద మల్టీఫంక్షనల్ టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. థీమేటిక్, బఫర్ జోన్లుగా విభజించారు. థీమేటిక్ జోన్‌లో వాటర్‌ఫాల్, గ్లాస్ బ్రిడ్జిలు, ఎస్పేస్ థీమ్డ్ జన్, అర్బన్‌హట్, అక్వేరియం టన్నెల్స్ ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. బఫర్‌జోన్‌లో గోదావరిని వ్యూ పాయింట్ నుంచి చూసేలా అభివృద్ధి చేస్తారు.

కడియంలో కన్వెన్షన్ సెంటర్..

ఇప్పటికే ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న కడియం నర్సరీలకు మరింత పర్యాటక శోభ రానుంది. కడియపులంకలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించనున్నారు. నర్సరీలలో ఒక నర్సరీ నుంచి మరో నర్సరీకి వెళ్లి తిలకించేలా ఏర్పాట్లు చేయనున్నారు. పొట్టిలంక, కడియపులంక, వేమగిరి మధ్య బోట్ షికారు ఏర్పాటుచేసి, నర్సరీలు సందర్శించేలా తీర్చిదిద్దనున్నారు. డిజైన్లను ధవళేశ్వరానికి చెందిన ఆర్కిటెక్ట్ భమిడిపాటి కిరణ్ రూపొందించారు.

సమిశ్రగూడెం కాలువలో..

నిడదవోలు కోటసత్తెమ్మ గుడికి మరింత ప్రాధాన్యత సంతరించేలా ఇక్కడ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారు. నిడదవోలు ఎమ్మెల్యే రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ఇక్కడ ప్రతిపాదన చేయడంతోపాటు నిధులు మంజూరు చేయించారు. విజ్జేశ్వరం నుంచి నిడదవోలు గుండా వెళ్లే ప్రధాన పంట కాలువలో సమిశ్రగూడెం వద్ద కాలువలో బోటు షికారు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ రెస్టారెంట్ సిద్ధం చేయనున్నారు.



గోదావరి హరివిల్లు.. బోట్ హౌస్

పుష్కర ఘాట్ అభివృద్ధి

ఆధ్యాతిక కేంద్రంగా పుష్కరఘాట్ తీర్చిదిద్దనున్నారు. గోదావరి మాత గుడిని నిర్మించనున్నారు. ఇక్కడ శివపార్వతులు, వినాయక, కార్తికేయ అలయాలు నిర్మించనున్నారు. నక్షత్ర స్తంభాలు దివ్యత్వం ఉట్టిపడేటట్టు గోదావరి, ఆస్ట్రాలాజికల్ స్టార్స్ నిర్మించనున్నారు. మండపాలు, మెడిటేషన్, స్పిరిట్యువల్, వాణిజ్య సౌకర్యాలు కల్పించనున్నారు.



వచ్చే పుష్కరాలకు రూపురేఖలు మారుస్తాం..

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రెండు పర్యాటక ప్రాజెక్టులకు రూ. 113.751 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అఖండగోదావరికి, గండికోట ప్రాజెక్టుకు కలిపి మొత్తం రూ.177 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. వచ్చే పుష్కరాలకే రూపురేఖలు మారతాయి.

- కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి



ఉపాధి కల్పనకు ఉద్యమ్ సర్వే కీలకం: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

అమలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్థిక వ్యవస్థ పురోగతికి, ఉపాధి కల్పనకు ఉద్యమ్ సర్వే కీలకమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా ఆర్థిక పురోగతి సాధించాల్సి ఉందన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న పరిశ్రమల పురోగతి, కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు, ఉపాధి అవకాశాల కల్పన ఆధారంగా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎంఎస్ఎంఎ, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్‌ల ద్వారా ఎక్కువ ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు అదనంగా ప్రోత్సాహకాలు ఇస్తారన్నారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదంతో జిల్లా సమగ్రాభివృద్ధి సాధనకు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే దిశగా పక్కా వివరాలు సేకరించి ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

ఉపకార వేతన పరీక్షను సజావుగా నిర్వహించాలి

అమలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో డిసెంబరు 8న జాతీయ ఉపకార వేతన పరీక్ష-2024ను సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు నియమితులైన అధికారులతో జేసీ గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పేపరు లీకేజీలకు ఆస్కారం లేకుండా ప్రశ్నపత్రాల తరలింపు, జవాబుపత్రాలు గమ్యస్థానాలకు చేర్చే ప్రక్రియలను పోలీసు భద్రత నడుమ నిర్వహించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరీక్షా కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఈవో షేక్ సలీంబాషా, ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఎస్.రాజబాబు, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం పాల్గొన్నారు.

ఇక విద్యుత్ స్మార్ట్ మీటర్లు

తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు..వ్యాపార సంస్థలకు

మండపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి వచ్చేశాయి. తొలి విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో ఉన్న పాత విద్యుత్ మీటర్లను తొలగించి వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటిదాకా విద్యుత్ బిల్లులు రీడింగ్ తీసుకోవడానికి ఏజెన్సీలకు చెందిన సిబ్బంది వచ్చి ఐఆర్ మీటర్లు వద్ద తమ సెల్‌ఫోన్ ద్వారా రీడింగ్‌ను నమోదు చేసి వచ్చిన బిల్లులను ప్రింట్ తీసి ఇచ్చేవారు. సిబ్బంది వచ్చిన సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకపోతే ఇబ్బందులు పడేవారు. బిల్లు తీయడం కష్టంగా మారేది. దీనివల్ల బిల్లుల బకాయిలు పేరుకుపోయిన పరిస్థితి ఏర్పడేది. ఇక నుంచి ఇటువంటి సమస్యల పరిష్కారానికి స్మార్ట్ మీటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.



విద్యుత్ చౌర్యానికి చెక్

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ద్వారా విద్యుత్ చౌర్యానికి చెక్ పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. సిబ్బంది ప్రతి నెల వచ్చి రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండదు. ఆన్‌లైన్ ద్వారా మోనటరింగ్ కేంద్రానికి మీటర్ రీడింగ్ చేరుతుంది. ఎన్ని యూనిట్లు వాడారు? ఎంతమేర బిల్లు చెల్లించాలనే వివరాలను ఫోన్ మెసేజ్ ద్వారా తెలియపరుస్తారు. గడువులోగా బిల్లు చెల్లించకపోతే మానిటరింగ్ కేంద్రం నుంచే స్మార్ట్ మీటర్ ద్వారా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తారు. గతంలో మాదిరిగా విద్యుత్ ఫీజులు తొలగించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది లైన్‌మెన్ ఎవరూ ఇంటికి రావాల్సిన అవసరం ఉండదు. ఎవరైనా సరే విద్యుత్ చౌర్యానికి పాల్పడితే స్మార్ట్ మీటర్ మోనటరింగ్ కేంద్రానికి సమాచారం పంపుతుంది. దీంతో వెంటనే విద్యుత్ చౌర్యంను అరికట్టడమే కాకుండా సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎక్కడ, ఎందుకు సరఫరా నిలిచిపోయింది. స్మార్ట్‌మీటర్ ద్వారా వెంటనే మోనటరింగ్ కేంద్రానికి సంకేతాలు వస్తాయి. సిబ్బంది నేరుగా అక్కడకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు.

తగ్గనున్న బకాయిల భారం..

తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్‌లో గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ బకాయిల భారం తగ్గుతుంది. సౌర విద్యుత్‌ను కూడా అనుసంధానం చేయవచ్చు.

స్మార్ట్ మీటర్ వల్ల ప్రయోజనాలు

విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండవు. విద్యుత్ ఆదా అవుతుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు బిల్లు ఎంతయిందో తెలుసుకోవచ్చు. భవిష్యత్‌లో ఈ మీటర్లను ప్రీపెయిడ్‌గా ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల విద్యుత్ సరఫరా ఎంత కావాలో అంతవరకు మాత్రమే ముందుగా బిల్లు చెల్లించుకునే వెసులుబాటు వినియోగదారుడికి ఉంది.

తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు,

వాణిజ్య సంస్థలకు ఏర్పాటు

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి 10,364, పరిశ్రమలకు సంబంధించి 2087, వ్యాపార వాణిజ్య సంస్థల సర్వీసులు 62,904, గృహ విద్యుత్ సర్వీసులు 5,36,980, వరకు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఆ తర్వాత గృహాలకు ఏర్పాటు చేస్తాం. రెండేళ్ల పాటు ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది.

రాజబాబు,
జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ

పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక రాయితీలు



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్

అమలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందని డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు బలోపేతం చేయడంతో పాటు ఆయా యూనిట్లను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో గురువారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఎంఎస్ఎంఈ సర్వే విధివిధానాలపై శిక్షణ నిర్వహించారు. వివిధ అంశాలపై ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి ఏపీపీ మాధురి, డీఎల్డీవో ఎస్.త్రినాథరావు శిక్షణ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వ్యూహాలు, చర్యల రూపకల్పనకు డేటాబేస్ అత్యంత అవసరమని, అందుకోసమే ప్రభుత్వం ఉద్యమ్ సర్వే యాప్‌ను రూపొందించిందన్నారు. శిక్షణలో జిల్లాలోని వివిధ సచివాలయాలకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



7లో

అట్టహాసంగా అండర్-14 క్రికెట్ పోటీలు ప్రారంభం

బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



మా ఊరు.. 'మొగళ్లమూరు'

మొగలి పుష్పాలే ఊరు పేరు

ఊరంతా మొగలి చెట్లే

ప్రత్యేక కథనం 6లో

మా ఊరు.. 'మొగళ్లమూరు'





మొగలి పుష్పాలే ఊరు పేరు

ఊరంతా మొగలి చెట్లే



సువాసన ఇచ్చే పూలు ఎన్నున్నా మొగలి పువ్వులు ప్రత్యేకత వేరు. ముళ్లతో ఏమాత్రం తాకడానికి వీలుకాని రీతిలో ఉండే ఈ చెట్లకు పూసే పూలు ఆ ప్రాంతమంతా సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి. ఇది వరకు ఊరారూ పొలాలకు వెళ్లే దారిలో మొగలి చెట్లు కనిపించేవి. ఇప్పుడు వాటి జాడే సరిగా కనిపించడం లేదు. అయితే అసలు ఈ మొగలి పూల పేరుతోనే ఒక ఊరుంది. ఆ ఊరి పేరు 'మొగళ్లమూరు'. పేరుకు తగ్గట్టు ఇప్పటికీ మొగలి చెట్లకు నెలవుగా ఆ ఊరు పరిమళిస్తోంది.

సువాసనలు వెదజల్లే మొగలి పుష్పాలకు ఉన్న ఆకర్షణ వేరు. పువ్వు లంటే ఇష్టపడే వారంతా మొగలి పూలంటే ఇంకా ఇష్టపడ తారు. ఇలా మొగలి పూల పేరుతో ఒక ఊరే ఉంది. అది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం మొగళ్లమూరు. మొగలి పొదలు అధికంగా ఉన్న ప్రాంతం కావడంతో దీనికి ఆ పేరు స్థిరపడినట్టు చెబుతారు. ఇప్పటికీ అతిపొడవైన మొగలి పుష్పాల చెట్లతో కూడిన పొదలు చాలా ఉన్నాయి. ముళ్లు కలిగి పచ్చని ఆకులతో ఉండే మొగలి చెట్లు కాండంపై శివారు భాగాన పసుపు రంగు కలిగి సువాసనలు వెదజల్లే మొగలి పుష్పాలు పూస్తాయి. ఈ మొగలి పుష్పాల పొప్పిడి పుష్పాల రేకుల నుంచి అత్తర్లు, అగరవత్తులు తయారు చేస్తా రు. అలాగే చిన్నసైజు తొండాల వలే కాండాలకు వేలాడే వేరు భాగాలను కోసి నారా తీసి బుట్టల అలికకు ఉపయోగిస్తారు. పడిపోయిన కాండం ముక్కలతో కాలువలు, చెరువుల్లో నీటి అడుగున ఉంచి దొందులు, బొమ్మిడాయిలు, కొరమేను చేపలు పట్టడానికి ఉపయోగిస్తారు. మొగళ్లమూరు, కొమరగిరిపట్నం, ఓడలరేవు గ్రామాల్లో ఈ చెట్లు నేటికి కనిపిస్తున్నాయి. మొగలి పుష్పాలు పెళ్లిళ్ల, శుభాకార్యాల్లో అలంకారాలకు మంచి డిమాండ్ ఉంది. **- అల్లవరం**

రుచిలో జీడిపప్పు రారాజు. ఏ వంటకం తయారులోనైనా జీడిపప్పు కలిసిందంటే దాని టేస్టే మారిపోతుంది. ఇక విడిగా జీడిపప్పునే స్నాక్ ఐటమ్స్‌గా తినడం చాలామందికి ఇష్టం. బెల్లంపాకంతో పట్టిన జీడిపప్పు అచ్చుకి యమా క్రేజు. కారంగా కరకరలాడుతూ ఉండే 'రోస్టెడ్ కాజు' తింటే ఆహా అనాల్సిందే. ఇవి ఎక్కడైనా దొరుకుతాయిగానీ, జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమ కేంద్రం అయిన మోరిలో తయారయ్యే జీడిపప్పు స్వీటు, హాటుకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.




తింటే మర్చిపోరు.. మోరి జీడిపప్పు అచ్చులు

రుచిలో అమోఘం బెల్లం అచ్చులు.. కరకరలాడే స్పైసీ, రోస్టెడ్ కాజులోనూ స్పెషల్


తీయదనం.. కమ్మదనంతో నోటికి కరకరలాడే మోరి జీడిపప్పు ఎంతో రుచికరం. ఆరోగ్యకరం. జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో మోరి గ్రామానికి రాష్ట్రంలోనే పేరుంది. ఇక్కడ నుంచి దేశవిదేశాలకు జీడిపప్పు ఎగుమతులు జరుగుతుంటాయి. ఇక్కడ నెంబర్ వన్ క్వాలిటీ మోరి జీడిపప్పు కిలో రూ.850 ధర పలుకగా, ఆ జీడిపప్పును వివాహాది శుభకార్యాలు, విందు భోజనాల్లో కూరల్లో ఉపయోగిస్తుంటారు. మోరి జీడిపప్పు వల్ల ఆ వంటలు రుచికరంగాను, అమోఘంగా ఉంటాయని భోజన ప్రియులు చెబుతారు. ఆ మోరి జీడిపప్పును ఇటీవల సారెల్లోను, స్వీట్లు, అచ్చుల రూపంలో బెల్లం పాకంతో తయారుచేసి విక్రయిస్తున్నారు. నిశ్చయ తాంబూలాలు, వివాహాది శుభాకాంక్షలు తెలిపేటప్పుడు హృదయాకారంలో అచ్చులను తయారుచేసి స్వీట్లు బాక్సుల్లో అందిస్తున్నారు. తోటి స్నేహితులు, బంధువులు, ఉన్నతాధికారులు వీటిని రుచి చూసిన అనంతరం మళ్లీ తమకు మోరి జీడిపప్పు అచ్చులు కావాలని తెప్పించుకుంటూ ఉంటారు. బెల్లం పాకం పట్టిన జీడిపప్పు అచ్చు రూ.750 ధర ఉండగా, స్పైసీ, రోస్టెడ్ జీడిపప్పు కిలో రూ.950 ధర పలుకుతుంది. మోరిలో ప్రధానంగా బెల్లంపాకంతో తయారుచేసే కంగుట్ల రామారావు వంద గ్రాముల నుంచి కిలోల లెక్కన ఎన్ని ఆర్డర్లు వచ్చినా ఉదయం పూట తయారుచేసి అప్పటికప్పుడు అందివ్వడంతో మోరి జీడిపప్పును రుచిచూసిన వారందరూ ఆహా ఏమి రుచి అని కితాబిస్తున్నారు. ఇటీవల కాలంలో విందు భోజనాల్లో జీడిపప్పు లేని వంటకం లేదు. ఈ జీడిపప్పు తయారీపై చిన్నా పెద్దా తేడా లేకుండా మోరి గ్రామ ప్రజలంతా ఉపాధి పొందుతున్నారు. మోరికి ఆనుకుని ఉన్న ఇతర గ్రామాల వారు కూడా జీడిపప్పు తయారీలో భాగస్వాములై లబ్ధి పొందుతున్నారు. **- అంతర్వేది**





పుట్టినరోజులు, పెళ్లిరోజులు, శుభకార్యాల కోసం హృదయాకారంలో జీడిపప్పు అచ్చు

పచ్చబొట్టేసినా...



- టాటూలకు విశేష ఆదరణ
- నాటి పచ్చబొట్టు ... నేడు టాటూ
- వివిధ ఆకృతుల్లో శరీరంపై ముద్ర
- ఆసక్తి కనబరుస్తున్న యువత

పచ్చబొట్టు చెరిగిపోదులే నా రాజా అని పలకరించినా.. పచ్చబొట్టేసినా పిల్లగాడా నిన్ను.. అంటూ పులకరించినా గుండెల నిండా చెదిరిపోని ప్రేమావేశానికి నిదర్శనమది. అదిప్పుడు ఒళ్లంతా చెరగని ముద్రవేసుకుంటోంది. నిన్నటి పచ్చబొట్టు నేడు టాటూగా ఆకర్షించి ఆదరణ పొందుతోంది. ఇష్టమైన వాళ్ల రూపాన్ని, పేర్లని అందమైన ఆకృతులతోపాటు వివిధ రకాల జంతువులు, పక్షులన్నీ రమణీయంగా ఒళ్లంతా ఆవిష్కరిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు టాటూలకు మొగ్గుచూపుతుండడంతో ప్రస్తుతం టాటూల ట్రెండ్ నడుస్తోంది. రెండు దశాబ్దాల కిందటి వరకు ఇష్టమైన పేర్లు, ఆకారాలను పచ్చరూపంలో పొడిపించుకునేవారు. ఈ విధానం పూర్తిగా నాటు పద్ధతిలో ఉండేది. పచ్చపొడుపించుకున్న వారు రెండ్రోజులపాటు జ్వరంతో బాధపడే పరిస్థితి ఉండేది. ఈ విధానం కనుమరుగైంది. ఇదే తరుణంలో టాటూ సంస్కృతి విస్తృతంగా వ్యాప్తించింది.

సూదులతో పచ్చబొట్టు...

యువతను ఆకర్షించేందుకు సినిమా థియేటర్ల వద్ద పచ్చబొట్టు పొడిచేవారు సిద్ధంగా ఉంటున్నారు. ముందుగా చెక్కతో తయారు చేసిన అచ్చుతో ముద్రవేస్తారు. ముద్రకు అనుగుణంగా సూదులతో పచ్చబొట్టు వేస్తారు. ఆకృతులను బట్టి ధర చెల్లించాల్సి ఉంటుంది. టాటూల్లో చాలా రకాలున్నాయి. యువతను ఆకర్షించేందుకు లవ్ సింబల్, హార్ట్ సింబల్, సీతాకోక చిలుక, నెమలి పింఛం, ఓంకారం, పుర్రే, డైనోసర్, కోడిపుంజు, సింహంతోపాటు వివిధ ఆకృతులు అందుబాటులో ఉన్నాయి. కొందరు అక్షరాల రూపంలో టాటూలు వేయించుకుంటున్నారు. షాపింగ్ మాల్స్ ముఖ్యకూడలిల వద్ద యువతను ఆకర్షించేందుకు టాటూ కౌంటర్లను ఏర్పాటుచేస్తున్నారు. మిషన్లతో నచ్చిన ఆకారాలు, ఆకృతులు, పేర్లను రాస్తున్నారు. ఇక ఫంక్షన్ల వద్దా టాటూ కౌంటర్లను పెడుతున్నారు.

సూదులతో జాగ్రత్త...

నాటు పద్ధతిలో శరీరంపై వేయించుకునే పచ్చబొట్టు విషయంలో జాగ్రత్తలు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. సూదితో వేసే ముద్ర పొడిపించుకునే సందర్భంలో ఒకరికి ఉపయోగించిన సూదిని వేరొకరికి ఉపయోగించడం ప్రమాదకరం. కొత్త సూదులను మాత్రమే వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. **- రావులపాలెం**





చింతూరు-మారేడుమిల్లి మధ్య ఘాట్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

ఘాట్ కష్టాలు గట్టెక్కినట్టే!

చింతూరు-మారేడుమిల్లి ఘాట్ రోడ్డు మరమ్మతులకు రూ.5.21 కోట్లు మంజూరు

చింతూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు ఘాట్ రోడ్డు మరమ్మతులకు భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాయి. చింతూరు- మారేడుమిల్లి మధ్యం దూరం 51 కి.మీ.గా ఇందులో ఘాట్ 28 కి.మీ. గత ఐదేళ్లలో ఈ రోడ్డు మెయింటెనెన్స్ పనులు ముట్టలేదు. దీంతో పలు ప్రదేశాల్లో గుంతలు పడ్డాయి. మరి కొన్ని ప్రదేశాల్లో రహదారి అంచులు వర్షం ధాటికి కొట్టుకపోయాయి. దీంతో అటువైపు ప్రయాణం అసౌకర్యంగా, ప్రమాదభరితంగా మారింది. ఈ రహదారి మీదుగా మన రాష్ట్రం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్రలకు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న రహదారిని గత వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రూ.4.21 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ సిద్ధమైంది. వేర్వేరుగా రెండు టెండర్లు పిలిచింది. మొదటిది చింతూరు-మారేడుమిల్లి మధ్య తాత్కాలిక మరమ్మతులకు రూ.46 లక్షలు కేటాయించింది. వీటికి టెండరు ప్రక్రియ ముగిసింది. త్వరలో పనులు మొదలు కానున్నాయి. రెండో టెండరులో ఘాట్‌లో 8 కి.మీ. మేర పనులు చేపట్టేందుకు రూ.3 కోట్లు కేటాయించింది. లక్కవరం నుంచి చింతూరు వరకు 4 కి.మీ. మరమ్మతులకు రూ.1.75 కోట్లు కేటాయించారు. ఈ రెండు పనులు టెండర్ దశలో ఉన్నాయి.




నాయకంపల్లి శివపంచాయతన క్షేత్రంలో భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న విధు శేఖర భారతీ మహాస్వామి

నాయకంపల్లిలో సనాతన ధర్మ ప్రచారం

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంలో అన్ని ప్రశ్నలకు సరైన సమాధానం ఉండనే ఉందని శంకరాచార్యులు ఈ లోకానికి తెలియజేశారని శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి పేర్కొన్నారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్టు ద్వారా గ్రామస్తులు, భక్తుల సహకారంతో నిర్మించిన శివపంచాయతన క్షేత్రంలోని సువర్ణ భారతి గోశాల, సువర్ణ భారతి పాకశాల, సువర్ణ భారతి ప్రవచన మంటపములను గురువారం ఆయన ప్రారంభించి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. ఇవాళ్టి రోజున ఇటువంటి ధార్మిక వాతావరణం, క్షేత్రం, సనాతన వైదిక ధర్మ పరంపరను చూస్తున్నామంటే దానికి కారణం నిస్సందేహంగా జగద్గురువులు ఆదిశంకరచార్యులేనన్నారు. తత్వం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస బంగారయ్య శర్మ మాట్లాడుతూ ఈ క్షేత్రం భవిష్యత్తులో దేదీప్యమానంగా వెలుగొందుతుందన్నారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పీవీ జనార్దన్‌నాయుడు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, చైతన్య విద్యా సంస్థల అధినేత చైతన్యరాజు, మలిరెడ్డి పాపారావు, ఎస్వీఎస్ అప్పలరాజు, జెట్టి గ్రానైట్ అధినేత శివకుమార్, జాస్తి వసంత్, పోతుల మోహనరావు, కుంచే రాజా, బూరుగుపల్లి వెంకటరావు, ఎస్ఆర్‌కే రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామికి ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

సత్యదేవుని మూలవర్లకు ప్రత్యేక పూజలు

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతీ మహాస్వామి గురువారం రాత్రి సత్యదేవుని సన్నిధికి విచ్చేశారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు, చైర్మన్ ఐవీ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవరులకు మహాస్వామి స్వయంగా ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతిఏటా తన గురువు భారతీ తీర్థానంద పేరున చైత్ర శుద్ధ షష్టి రోజున అన్నదానం జరిపించాలని కోరారు.



స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న యనమల దంపతులు

కుమ్మరిలోవ తపోవనంలో

విధు శేఖర భారతీ మహాస్వామి

తుని రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండవ కాశీగా పేర్గాంచిన కుమ్మరిలోవ తపోవనానికి శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విధు శేఖర భారతీ మహాస్వామి విచ్చేశారు. ఆయనకు తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మహా స్వామికి సచ్చిదానంద సరస్వతి ధూళి పాదపూజ నిర్వహించారు. సహస్ర మోదక గణపతి హోమం నిర్వహించారు. శ్రీరుద్రయాగ పూర్ణాహుతిలో మహాస్వామి పాల్గొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు దంపతులే. టీటీడీ పాలకమండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, అన్నవరం దేవస్థానం ఈవో త్రినాథ రావు, లోవ దేవస్థానం ఈవో, ఉప కమిషనర్ పి.విశ్వనాథ రాజు, దేవదాయ శాఖ ఆర్జేసీ కొమ్ముల సుబ్బారావు స్వామి ఆశీస్సులు పొందారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు సచ్చిదానంద సరస్వతి స్వామి శిష్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి తపోవనం క్షేత్రం వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

సత్యదేవుని సన్నిధిలో దేవదాయ శాఖ కమిషనర్

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి గురువారం దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ విచ్చేశారు. స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఈవో త్రినాథరావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ వున్నారు.



దర్శనానంతరం కమిషనర్ సత్యనారాయణ



పసుపు వస్త్రాలతో రత్నగిరి చేరుకున్న పల్లం గ్రామస్తులు

పల్లం నుంచి రత్నగిరికి...

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామం నుంచి సుమారు 500 మంది భక్తులు సత్యదేవునికి ప్రీతిపాత్రమైన పసుపు రంగు వస్త్రాలతో రత్నగిరికి చేరుకున్నారు. ఈనెల 25న పల్లంలో బయల్దేరామని, హిందూ ధర్మ భాగంగా ప్రతిఏటా ఈ విధంగా పాదయాత్రగా వస్తున్నామన్నారు. పల్లం గ్రామస్తులకు అన్నవరం దేవస్థానం ప్రొటోకాల్ సూపరెంటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ అల్పాహారం, వసతి ఏర్పాట్లు చేశారు.



ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న మహిళలు

సాంబశివునికి సారె సమర్పణ

ఏలేశ్వరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఏలేశ్వరం పట్టణంలో వేంచేసియున్న గౌరీ సాంబశివుని ఆలయానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య దంపతులు సారె సమర్పించారు. గురువారం వారి నేతృత్వంలో పసుపు, కుంకుమ, పండ్లు, స్వీట్లు, పువ్వులు, చీర, రవిక, గాజులు సమర్పించారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకట ప్రసాద్, తూరౌతు గురవయ్య, కటకం కిరీటి, బెల్లాని శ్రీను, ఉడతల రామణారావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- వచ్చేనెల 5న ఎన్నికలు
- 9న ఫలితాలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. వచ్చే నెల 2న కాకినాడ కలెక్టరేట్‌లో ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డిసెంబరు 5న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. 9న ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయి. ఇప్పటికే ఎన్నికల బ్యాలెట్ పత్రాలు రాగా ట్రెజరీ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. ఆరుజిల్లాల పరిధిలో 16737 మంది ఓటర్లు ఉండగా 19150 బ్యాలెట్ పత్రాలు సిద్ధంచేశారు. దీనికోసం 230 బాక్సులు సిద్ధం చేశారు.ఆరుజిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలకోసం 141మంది పీవోలు, 141మంది ఏపీవోలు,279మంది ఓపీవోలు, 141మంది సూక్ష్మపరిశీలకులను నియమించారు. ఆరు జిల్లాలకు 54, రూట్లు 32 జోన్లుగా విభజించారు. దీనికి రూట్, జోనల్ ఆఫీసర్లు, 88మందిని నియమించారు.ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు తలపడుతున్నారు.

నేడు పీజీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఏపీపీజీసెట్ రాయకపోయినా, రాసి అర్హత సాధించకపోయినా స్పాట్ అడ్మిషన్‌లో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చునన్నారు. డిగ్రీలోఉత్తీర్ణతా శాతం ఓసీ, బీసీ 50శాతం, ఎస్సీ, ఎస్టీలకు 45శాతం సాధించినవారు పీజీ ప్రవేశాలకు అర్హులన్నారు. ఉదయం 11గంటల్లోపు సంబంధిత విశ్వవిద్యాలయంకళాశాల కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని చెప్పారు.

తీరం అల్లకల్లోలం

- 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో తీరంలో ఈదురుగాలులు
- అలల ధాటికి మత్స్యకారుల ఇళ్లపైకి వచ్చి పడుతున్న సముద్రనీరు



ఉప్పాడలో అలల ఉధృతికి కొట్టుకుపోయిన మత్స్యకారుల ఇళ్లు



ఉప్పాడలో అల్లకల్లోలంగా మారిన సముద్రం

కొత్తపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో సముద్రతీరంలో అలలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం మధ్యలో కెరటాలు సుడులు తిరుగుతూ తారాస్థాయికి ఎగిరిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు సముద్రంలో లంగర్ వేసిన తమ బోట్లను రామన్నపాలెం ఉప్పుటేరు వద్దకు తరలించి భద్రపరుచుకున్నారు. తీరప్రాంతంలో సముద్రం ఉదయం నుంచీ అల్లకల్లోలంగా ఉండడం, ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు ఒడ్డున మకాం ఉంటున్న మత్స్యకారుల ఇళ్లలోకి దూసుకొస్తున్నాయి. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు చెందిన పిల్లలు, పెద్దలు అంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తల దాచుకుంటున్నారు. ఇటీవలకాలంలో తరచూ ఏర్పడుతున్న తుపాన్, అల్పపీడనాలతో వేట లేకపోవడంతో జీవనోపాధికి తీవ్ర ఆటంకం కలుగుతోందని, దీంతో కుటుంబాలను అప్పులు చేసి పోషించుకోవాల్సిన అగత్యం ఏర్పడిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేట విరామ సమయంలో ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని తీరప్రాంత మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న డీఈవో రమేష్.. క్రీడాకారుల ర్యాలీ

కాకినాడ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో రమేష్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు విద్యార్థులకు మానసికోల్లాసం అందిస్తాయన్నారు. డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అండర్-17 బాలికల విభాగంలో మూడు రోజులపాటు జరిగే పోటీల్లో వివిధ జిల్లాలనుంచి అధికారులతో సహా 200మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకుడు కె.ఈశ్వరరావు, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శివరామకృష్ణ, గీతం స్కూల్స్ అధినేత సుజ్ఞాన్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎన్ రామ్‌ప్రసాద్, చైర్మన్ కేవీబీ మోహనరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి కొర్.ఎస్‌జీ టీ సహాయ కార్యదర్శి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలే వీరే

కృష్ణా జిల్లాపై కర్నూలు జట్టు 13.9 స్కోతో గెలుపు, ప్రకాశంపై శ్రీకాకుళం 13.3, విశాఖపై తూర్పుగోదావరి 9.5, పశ్చిమగోదావరిపై నెల్లూరు 12.0, చిత్తూరుపై అనంతపురం 11.2, కృష్ణాపై శ్రీకాకుళం 13.1, కర్నూలుపై ప్రకాశం 22.10, విశాఖపై గుంటూరు9.1, నెల్లూరుపై కడప 10.0, చిత్తూరుపై విజయనగరం 10.0, పశ్చిమపై కడప 5.0 స్కోరుతో గెలుపొందాయి.

నేటినుంచి అంతర జిల్లాల బాలికల బాల్ బాడ్మింటన్ పోటీలు

బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఈనెల 29,30 తేదీల్లో అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం పి.వీరప్రభాకరరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ఆయన కిట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పీడీలు ధనరాజు, యువరాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, అప్పారెడ్డి, ప్రభాకరరెడ్డి, ఉపాధ్యాయులుశ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



బాలికలకు అందించిన కిట్లతో హెచ్ఎం, పీడీలు

జాతీయస్థాయిలోను సత్తా చాటాలి

- రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలు ప్రారంభించిన కోనసీమ కలెక్టర్



అనంతపురం జట్టుతో కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడాస్ఫూర్తిని చాటుతూ క్రీడాకారులు రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలోను ఇనుమడింప చేసేలా రాణించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ క్రీడా పోటీలను కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించా రు. క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం బ్యాటింగ్ చేసి పండుగ వాతావరణంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో క్రీడాకారులు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని పిలుపునిచ్చారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలిరోజు వివిధ జిల్లాల జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా జరిగాయి. ప్రారంభోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కుడుపూడిసూర్యనారాయణరావు, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, పాఠశాల హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను ఆర్గనైజింగ్ కార్యదర్శులు తోట రవి, గోవిందరావు, పి.విష్ణుప్రసాద్, ఫణీంద్రకుమార్,యాళ్ల మునలయ్య, కిశోర్, మధుసూదనరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చొల్లంగి ప్రసాద్, కార్యదర్శి బీవీవీఎస్ఎన్ మూర్తి, జోన్ అధ్యక్షుడు వైఎస్వీ రమణారావు, ఎంఈవో రేలంగి నాగకుమార్, విత్తనాల శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో కొట్లాట

- ఒకరికి తీవ్రగాయాలు, ముగ్గురికి గాయాలు
- డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో ఘటన

కాట్రేనికోన, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంలో గురువారం సాయంత్రం మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్ఐ అవినాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లం గ్రామంలో టీడీపీకి చెందిన దోమ మణికంఠ, బొమ్మిడి ప్రసాద్, మల్లాడి కొండయ్య, వైసీపీకి చెందిన కాటం శ్రీను మధ్య మద్యం మత్తులో వివాదం తలెత్తింది. దీంతో పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారు. తనను మణికంఠ, ప్రసాద్, కొండయ్య గాయపరిచారంటూ వైసీపీకి చెందిన కాటం శ్రీను పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ముమ్మిడివరం ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. మల్లాడి కొండయ్యకు తలపై తీవ్రగాయం కావడంతో బొమ్మిడి ప్రసాద్ తన వాహనంపై ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయం తీవ్రంగా ఉండడంతో అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐను వివరణ కోరగా ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారన్నారు. అయితే మల్లాడి కొండయ్యకు తలపై గాయానికి కారణమేంటో విచారణ నిర్వహిస్తామన్నారు. రెండు ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామన్నారు.



గాయపడిన మల్లాడి కొండయ్య

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

- సామర్లకోట మీదుగా 44 స్పెషల్ రైళ్ల రాకపోకలు
- వారంలో రెండురోజులు.. మూడు నెలలపాటు ఉండేలా ప్రణాళిక
- అయ్యప్ప దీక్షాధారులకు రైల్వే ప్రయాణ సదుపాయం



సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాలనుంచి అయ్యప్ప దర్శనంకోసం శబరిమల వెళ్తున్న భక్తులకు రైల్వే శుభవార్త అందించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్డు, హైదరాబాద్, కాచిగూడ నుంచి కొల్లాం, కొట్టాయంలకు పెద్దసంఖ్యలో ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటు చేసింది. అందులో సామర్లకోట మీదుగా విశాఖ, శ్రీకాకుళం రోడ్ నుంచి రానుపోను ఏర్పాటు చేసిన 44 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను రైల్వే పీఆర్వో కార్యాలయం ప్రకటించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే శబరిమల అయ్యప్ప దర్శనార్థం దీక్షాధారణలో వెళ్లే అయ్యప్పస్వామి భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా అటు విశాఖ నుంచి, శ్రీకాకుళం రోడ్‌ల నుంచి ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. ఈ మేరకు సామర్లకోట ఆంధ్రజ్యోతి ప్రత్యేక రైళ్ల సమాచారాన్ని సేకరించింది.

- 08539 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ విశాఖ-కొల్లాం మధ్య ప్రతి బుధవారం విశాఖ నుంచి రాత్రి 8.20 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు గురువారం అర్ధరాత్రి 12.55 గంటలకు కొల్లాం చేరుకోనుంది. డిసెంబరు 4 నుంచి 2025, ఫిబ్రవరి 26 వరకూ ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 4, 11, 18, 25, జనవరి 1, 8, 15, 22, 29, ఫిబ్రవరి 5, 12, 19, 26తేదీల్లో 13 ట్రిప్పులుగా ప్రతి బుధవారం నడవనుంది.
- 08540 నంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొల్లాం-విశాఖ మధ్య ప్రతి గురువారం కొల్లాం నుంచి రాత్రి 7.35 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖకు చేరుకోనుంది. డిసెంబరు 5 నుంచి 2025, ఫిబ్రవరి 27 వరకూ నడవనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 5, 12, 19, 26, జనవరి 2, 9, 16, 23, 30, ఫిబ్రవరి 6, 13, 20, 27తేదీల్లో 13ట్రిప్పులుగా ప్రతి గురువారం నడువనుంది.

ఈ రైళ్లు దువ్వాడ మీదుగా సామర్లకోటకు 11.19 గంటలకు, రాజమండ్రికి 12.21 గంటలకు చేరుకుంటుంది. ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొడనూర్, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం, చంగన్‌సెరి, తిరువళ్ల, చెంగన్‌నార్, మావెలియకరి, కాయంకులంల మీదుగా కొల్లాం జంక్షన్‌కు రెండు రోజుల అనంతరం చేరుకోనుంది. మొత్తం 1,562 కిలోమీటర్ల దూరంలో 28 స్టేషన్లలో ఆగనుంది.

- 08553 నంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళంరోడ్-కొల్లాం మధ్య ప్రతి ఆదివారం బయలుదేరనుంది. ఈ రైలు ఆదివారం ఉదయం 6 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకోనుంది. ఈ రైలు డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 5, 12, 19, 26 తేదీల్లో 9ట్రిప్పులుగా ప్రతిఆదివారం నడుస్తుంది.
- 08554 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొల్లాం-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రతి సోమవారం బయలుదేరనుంది. ఈ రైలు ప్రతి సోమవారం 4.30 గంటలకు బయలుదేరి బుధవారం 2.30 గంటలకు చేరుకోనుంది. ఈ రైలు డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20, 27వతేదీల్లో 9 ట్రిప్పులుగా నడువనుంది.

ఈ రైళ్లు శ్రీకాకుళం రోడ్, పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహాచలం, దువ్వాడ, అనకాపల్లి మీదుగా సామర్లకోటకు ఉదయం 10.18గంటలకు చేరుకుని రాజమండ్రికి 11.03గంటలకు చేరుతుంది. ఏలూరు, విజయవాడ, ఒంగోలు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొడనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం, ఎట్టుమన్నార్, కొట్టాయం, చంగన్‌సెరి, తిరువళ్ల, చంగన్‌నార్, మావెలియాకర్, కాయంకుళం మీదుగా కొల్లాంకు మధ్యాహ్నం 2.30 గంటలకు రెండు రోజుల అనంతరం చేరుకోనుంది. మొత్తం 1,691 కిలోమీటర్ల దూరంలో 34 స్టేషన్లలో ఆగనుంది. ఈరైళ్లల్లో ప్రయాణించే అయ్యప్ప భక్తులు తమ సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయంలో రిజర్వేషన్ టిక్కట్లు పొందవచ్చని ప్రకటించారు.

గుర్తుతెలియని కారు ఢీకొని గాయాలు

కరప, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని కారు ఢీకొని ఒక మత్స్యకారుడు తీవ్రంగా గాయపడ్డాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన రేకాడి కరుణకుమార్ మత్స్యకారుడు. ఈనెల 24న పనిమీద కాకినాడ వచ్చి తిరిగి వెళ్తుండగా కరప మండలం చొల్లంగి బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన కరుణకుమార్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకున్నాడు. బాధితుడు గురువారం కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వెంకన్న ఆలయంలో టీటీడీ చైర్మన్ నాయుడు పూజలు

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చక బృందం ఘనస్వాగతం పలికింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి ప్రదక్షిణలు నిర్వహించుకుని కుటుంబ సభ్యులతో ఆయన స్వామిని దర్శించుకున్నారు. వసంత మండపంలో పండితులు వేదాశీర్వచనం అందచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు టీటీడీ చైర్మన్ నాయుడు దంపతులకు నూతన వస్త్రాలను అందచేశారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటం అందచేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలుతగా చైర్మన్ నాయుడుని ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతలు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, ముత్యాల బాబ్జి, తదితర నేతలు ఆయనకు స్వాగతం పలికారు.



టీటీడీ చైర్మన్ నాయుడుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

5న కాకినాడలో 'వేగ జ్యూయలర్స్' ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వేగ జూయలర్స్ అధినేతలు

కాకినాడ సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న కాకినాడలో వేగ జ్యూయలర్స్ 4వ షోరూమ్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ తెలిపారు. గురువారం హోటల్ రాయల్ పార్క్‌లో వారు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 5వతేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు కాకినాడ బాలాజీచెరువు దగ్గరలో వేగ షో రూమ్‌ను సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, సినీనటి సంయుక్త మీనన్ ప్రారంభిస్తారన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా డిసెంబర్ 5 నుంచి 12 వరకు బీఐఎస్ హాల్మార్క్ బంగారు ఆభరణాలు, సర్టిఫికెట్స్‌తో డైమండ్స్ ప్రత్యేక రాయితీ, ఆఫర్లతో అందించనున్నామన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్లను కాకినాడ, పరిసర ప్రాంత ప్రజలందరూ వినియోగించుకోవాలని, రాబోయే క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగలను మరింత ఆనందంగా జరుపుకోవాలన్నారు. వివాహ ముహూర్తాలు, వివాహ వేడుకల కోసం సంప్రదాయ ఆభరణాలనుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకు అన్ని వర్గాలకు అందుబాటులో ఉంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లగా విజయవాడ, హైదరబాద్‌లో ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందించి ఖాతాదారుల విశ్వాసం పొందామన్నారు. కాకినాడలో షోరూమ్ ప్రారంభం తర్వాత రాజమహేంద్రవరంలో ప్రారంభిస్తామన్నారు. కాకినాడ ప్రజలు తమ కొత్త షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ప్రోత్సహించాలన్నారు. సంస్థకు సంబంధించి సినీనటుడు బాలకృష్ణ ప్రచారకర్తగా నటించిన యాడ్‌ఫిల్మ్‌ను విడుదల చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.40లక్షల ఎక్స్‌గ్రేషియా

- మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పరవాడ ఫార్మా పరిధిలో ఠాగూర్ ల్యాబ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మృతులు ఒక్కో కుటుంబానికి రూ.40లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని కార్మిక, పరిశ్రమల శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. ఈనెల 26న సాయంత్రం 4.40 గంటలకు ఠాగూర్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రియాక్టర్ జీఎల్ 325వద్ద హెచ్‌సీఎల్ క్లోరోఫామ్ లీకేజీ ప్రమాదంలో కార్మికులు అస్వస్థతకు గురయ్యారన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ అదేరోజున ఒకరు మృతి చెందగా గురువారం మరొకరు మృతి చెందడం బాధాకరమన్నారు. ఐసీయూలో ఉన్న మరోకార్మికుడు పరిస్థితి ఆందోళకరంగా ఉందన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.40లక్షల చొప్పున చెల్లించేందుకు సంస్థ యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందన్నారు. లీకేజీ ఘటనపై విచారణ జరిపించి నిర్లక్ష్యం వహించిన సంస్థపై చర్యలు తీసుకున్నామని మంత్రి సుభాష్ అన్నారు.

గంజాయి కేసుల్లో నిందితుల అరెస్టు

మోతుగూడెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో ఐదుగురు నిందితులు, ఒక మైనర్‌ని అరెస్టు చేసి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేసి వ్యసనాలకు అలవాటు పడి గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టురట్టు చేసిన డొంకరాయి పోలీసులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఐపీఎస్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, చింతూరు సీఐ టి.దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌కి వచ్చిన సమాచారంతో గురువారం 23 కిలోల గంజాయి రవాణా చేస్తున్న విజయవాడ ప్రాంతానికి చెందిన ఇందుకూరి త్రినాథ్, డికొండ రాజేష్, రెళ్ల సాయికిరణ్, ఓమైనర్‌ను పట్టుకున్నారు. వారిలో ముగ్గురిని రిమాండ్‌కి తరలించారు. మైనర్‌ను జువనైల్ హోమ్‌కి తరలించినట్లు తెలిపారు. ఈ నలుగురు విజయవాడ, మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తారని, వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మి వచ్చిన సొమ్ముతో గంజాయిని కొనుగోలు చేస్తున్నారని పోలీసులు తెలిపారు. దొంగిలించిన మూడు ద్విచక్రవాహనాలను గుంటూరు శివారు ప్రాంతంలో ఉంచగా వాటిని పోలీసులు రికవరీ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా హోండా లియో బైక్‌పై రెండు కిలోల గంజాయి అక్రమ రవాణా చేస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన వీఫు వెంకటేష్, మరిగల మణికంఠలను అరెస్టు చేశారు. ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడి వచ్చిన సొమ్ముతో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన డొంకరాయి రైటర్ శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ్, కానిస్టేబుల్ పోశయ్యను ఏఎస్పీ అభినందించారు.

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో.. ప్రత్యేక రైళ్ల కాలపరిమితి పెంపు

సామర్లకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా కాకినాడ నుంచి లింగంపల్లి మధ్య నడిచే 07445నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును వచ్చేనెల 6 నుంచి 30 వరకూ పొడిగిస్తూ రైల్వే పీఆర్వో ఎ.శ్రీధర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు గురువారం అందాయి. ఈ రైలు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో కాకినాడ టౌన్ స్టేషన్‌నుంచి లింగంపల్లికి బయలుదేరుతుంది. లింగంపల్లి-కాకినాడటౌన్ మధ్య నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ వచ్చేనెల 7 నుంచి 31వరకూ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ రైలు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో లింగంపల్లిలో బయలుదేరి కాకినాడ టౌన్‌కు చేరుతుంది. ఈ రెండు రైళ్లూ రాజమండ్రి, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ మీదుగా విజయవాడకు చేరనున్నాయి. రైల్వేస్టేషన్‌ల్లో రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని పీఆర్వో శ్రీధర్ తెలిపారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు



ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి, నిత్యాన్నదాన ట్రస్టులో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సిద్ధివినాయకుడి ఆలయం కిటకిట

అయినవిల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం త్రయోదశి సందర్భంగా గురువారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయం, ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణ ముక్తీశ్వరాలయం, శ్రీరాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అయినవిల్లి సిద్ధివినాయకస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టులో భక్తుల రద్దీ నెలకొంది.

సృజనాత్మకతను వెలికితీసే 'సెలయేరు'

అమలాపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సెలయేరు పత్రిక దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా చెప్పారు. పేరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం సెలయేరు పత్రికను ఆవిష్కరించారు. మామిడిశెట్టి సత్యనారాయణమూర్తి అండ్ వెంకటలక్ష్మి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా అమలాపురం డివిజన్‌స్థాయిలో వివిధ పాఠశాలల విద్యార్థులు రచించిన కథా సంపుటియే సెలయేరు పత్రిక అని ఆయన పేర్కొన్నారు. కథా సంపుటి రచనల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పేరూరు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు మామిడిశెట్టి బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం కేఏఆర్ శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



సెలయేరు పత్రికను ఆవిష్కరిస్తున్న డీఈవో సలీంబాషా



విగ్రహాలు, పూలు పండ్ల దుకాణాలతో ఉన్న మామిడికుదురు బస్టాండ్

ఆక్రమణల చెరలో ఆర్టీసీ బస్టాండ్

• ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు • పట్టించుకోని అధికారులు

మామిడికుదురు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని ఆర్టీసీ బస్టాండు ఆక్రమణలకు గురవ్వడంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ ముందు జాతీయ నాయకుల విగ్రహాలు, పండ్ల, పూల దుకాణాలు ఏర్పాటుచేయడంతో బస్టాండ్ కనిపించడంలేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా బస్టాండు ప్రాంగణంలో షిర్డిసాయిబాబా మందిరం ఏర్పాటు చేశారు. కొంతమంది బస్టాండును సైకిల్ స్టాండులా ఉపయోగించుకుంటూ సైకిళ్లు, మోటారు సైకిళ్లను బస్టాండులో పెట్టడంతో ప్రయాణికులు కూర్చోవడానికి వీలు లేకుండాపోయింది. ప్రయాణికులు కూర్చునేందుకు వేసిన బల్లలు ధ్వంసమయ్యాయి. బస్టాండ్ ఆక్రమణలకు గురవ్వడం, కూర్చోవడానికి అవసరమైన బల్లలు లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు జాతీయ రహదారిచీ పక్కనగల పండ్ల దుకాణాలు, కిరాణాషాపుల వద్ద నిలబడి బస్సులు కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో సమయంలో షాపు యజమానుల చీత్కారాలకు గురికావాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. నిత్యం మామిడికుదురు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రయాణికులు ఈ బస్టాండ్‌కు వస్తుంటారు. నిత్యం రాజోలు, మలికిపురం, జగ్గన్నపేట, అమలాపురం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల్లో గల స్కూళ్లు, కళాశాలలకు విద్యార్థులకు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. బస్టాండు ఆక్రమణలకు గురవ్వడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే ఈ ఇబ్బందులు రెట్టింపు అవుతున్నాయని వాపోతున్నారు. వైనతేయ నదిపై బోడసకుర్రు బ్రిడ్జి నిర్మాణంతో అమలాపురం వైపు రాకపోకలు ఎక్కువకావడంతో ఈ బస్టాండ్ నుంచే అధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణల పాలైన బస్టాండ్‌ను ఆధునీకరించి ప్రయాణికులు, విద్యార్థులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ఆక్రమణలపై రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించగా డిపో మేనేజర్ ప్రస్తుతానికి ఇంకా ఎవరూ బాధ్యతలు స్వీకరించలేదని సీనియర్ ఇన్‌స్పెక్టర్ దొర తెలిపారు. ఆక్రమణల విషయం తమ దృష్టికి వచ్చిందని, కొత్తగా డీఎంగా బాధ్యతలు చేపట్టిన అధికారికి సమస్యను తెలియజేస్తామని ఆయన తెలిపారు.



బస్టాండ్‌లో బల్లలులేక ముందు నిలబడిన విద్యార్థులు, ప్రయాణికులు

కుండలేశ్వరుడికి పూజలు



కాట్రేనికోన, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గురువారం అధిక సంఖ్యలో భక్తులు కుండలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరిమాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాశ్యకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ఉప్పూడికి చెందిన బొబ్బిలి పాపారావు, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో 3500మంది భోజనాలు చేశారు. ఈవో కె.గంగాధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివకేశవులకు లక్షబిల్వార్చన

అంబాజీపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారంలో గ్రామంలో ఉన్న శ్రీఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవి శ్రీభూదేవి సమేత కేశవస్వామి వార్ల ఆలయంలో లక్షబిల్వార్చన పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం శెట్టిబలిజ సంఘీయుల ఆధ్వర్యంలో స్వామివార్లకు లక్ష పత్రిపూజ, పంచామృతాభిషేకాలు, హోమాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయంవద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని ఏకాదశ రుద్రులయాత్రకు భక్తులుపోటెత్తారు.

రాజులపాలెంలో లక్షతులసి పూజ

పి.గన్నవరం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులపాలెంలో ఉన్న శ్రీపట్టాభి రామస్వామి ఆలయంలో క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో లక్షతులసీ పూజ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు పెదపూడి వెంకటసత్యరమణాచార్యులు నేతృత్వంలో వాడపల్లి నరసింహాచార్యులు స్వామివారికి తులసిపూజతోపాటు ప్రత్యేక అభిషేకాలను వైభవంగా నిర్వహించారు. పేరిచర్ల నాగరాజు, రామరాజు, వెంకటన రసింహారాజు, ఇందుకూరి నరసింహరాజు, కోల్నాడ అశోక్ వర్మ, వెంకట సత్యనారాయణ రాజు, విశ్వనాధరాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రుద్రాభిషేకం

అమలాపురంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో భక్తులు రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ పురోహితులు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆధ్వర్యంలో కొండా శ్రీనివాసరావు, కొండా భీమేశ్వరరావు, లక్కింశెట్టి శ్రీధర్ దంపతులు రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహాలింగార్చనలో రుద్రాక్ష పూజలు

ఉప్పలగుప్తం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో జరుగుతున్న కార్తీక మహాలింగార్చన గురువారం 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా 365 శివలింగాలతో అభిషేక పూజలు నిర్వహించారు. రుద్రాక్షలతో ప్రత్యేక పూజలు జరిగాయి. మున్నంగి రామకృష్ణశర్మ సారథ్యంలో కిశోర్‌శర్మ బ్రహ్మత్వంలో జరిగిన పూజా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



కొత్తలంకలో విద్యుత్ తీగలపై పడిన కొబ్బరిచెట్టు

ముమ్మిడివరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా వీస్తున్న పెనుగాలులకు మండలంలోని ముమ్మిడివరం, కొత్తలంక రోడ్డులో ఓ కొబ్బరిచెట్టు విద్యుత్ తీగలపై పడింది. ఆ సమయంలో వాహనాలు గానీ, స్కూలు పిల్లలు గానీ అటుగా వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలపై కొబ్బరిచెట్టు పడడంతో తీగలు తెగిపడ్డాయి. ట్రాన్స్‌కో అధికారులు, పంచాయతీ సిబ్బంది పడిన చెట్టును తొలగించి విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ఎక్కువ రోజులు జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించాలని సీహెచ్‌వో బి.అప్పారావు సూచించారు. మాచవరం కుమ్మరివారివీధిలో గురువారం వైద్యశిబిరాన్నిఏర్పాటు చేశారు. పలు వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చింతనలంకలో అగ్ని ప్రమాదం

• రూ.25లక్షల ఆస్తి నష్టం



అగ్నికి ఆహుతవుతున్న తాటాకు ఇళ్లు

అయినవిల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతనలంక గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరు ఇళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. రూ.25లక్షల ఆస్తి నష్టం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్ స్తంభం ఒరిగిపోయిందని సరిచేయాలని గత కొంత కాలంగా ప్రజలు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంలేదు. గురువారం విద్యుత్ వైర్లు ఇళ్లను తాకడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సవరపు సుబ్బారావు, సవరపు నాగూర్, ముమ్మిడివరపు వెంకట్రావు, సవరపు రత్నం, కొల్లు దుర్గ కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.25లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. చింతనలంకకు చెందిన విళ్ల రామమనోహర్ గోపీనాథ్(రాము) బాధితులకు రూ.లక్షఆర్థికసాయం అందజేశారు.

ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చెప్పారు. గురువారం సాయంత్రం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, ఇతర సామగ్రి అందజేశారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్బారావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపరాజు సత్యనారాయణరాజు, పోలిశెట్టి రాజేష్, విళ్ల నవీన్, విళ్ల రాము, నేదునూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కందలపాడు రహదారికి మోక్షం

• ఇనుప స్తంభాలు తొలగింపు

అమలాపురంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బండారులంక శివారు కందులపాడు కాలనీకి వెళ్లే పంచాయతీ రహదారిపై అక్రమంగా ఇనుప స్తంభాలు వేయడంతో తొమ్మిది నెలలుగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక ప్రజల సమస్యలను బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు ఆధ్వర్యంలో పలు పర్యాయాలు కలెక్టర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని రోడ్డు మధ్యలో వేసిన ఇనుప స్తంభాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామ పెద్దల సమక్షంలో గురువారం రోడ్డుకు అడ్డంగా వేసిన స్తంభాలను పంచాయతీ అధికారులు తొలగించడంతో ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు మోహన్‌బాబు, రేవు తిరుపతిరావుకు, ప్రభుత్వ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అణగారిన వర్గాలకు దిక్సూచి పూలే

• రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ • జ్యోతిరావు పూలే వర్ధంతి



మలికిపురంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, గుబ్బల శ్రీనివాస్, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, పిండి సత్యనారాయణ, గుబ్బల ఫణి, నల్లి మోహనరావు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పూలే అంబేడ్కర్ భవన్‌లో బహుజన సమన్వయ సమాఖ్య ఆధ్వర్యంలో పూలే వర్ధంతి సభ జరిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పూలే సేవలను వివరించారు. కార్యక్రమంలో గెడ్డం తులసీభాస్కర్, బత్తుల లక్ష్మణరావు, గుబ్బల బాబ్జి, నల్లి శివ, యేడిద శ్రీదేవి, చింతా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలి సంస్కరణవాది పూలే: ఎమ్మెల్సీ కుడుపూడి

అమలాపురంటౌన్: దేశంలో తొలి సంఘ సంస్కర్తగా జ్యోతిరావుపూలే నిలుస్తారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు చెప్పారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని అమలాపురం చిట్రన్స్ పార్కులోని పూలే విగ్రహానికి గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్, చిట్టూరి పెదబాబు, చీకురుమెల్లి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భూపయ్య అగ్రహారంలో దళితసేన ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. దళితసేన అధ్యక్షుడు డేవిడ్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకపల్లి హరీష్, సాపే రమేష్, తానంకి వసంతకుమార్, మాకే భవానీప్రసాద్, రాజేష్, బాబ్జి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో నైతిక మార్పు

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని మండల బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లు మహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యకర్తలతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మెరుగుమువ్వల ప్రసాద్, తాడి సత్యనారాయణ, కౌరు శ్రీను, చెల్లింగి శ్రీనివాస్, ఉండ్రాజవరం బాబూరావు, కమిడి ప్రసాద్, పమ్మి దుర్గాప్రసాద్, కడలి వెంకటరత్నం, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

మామిడికుదురు: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే అని పలువురు వక్తలు కొనియాడారు. పూలే వర్ధంతిని మామిడి కుదురులోని బాలుర వసతిగృహంవద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గుబ్బల మురళీకృష్ణ, బొక్కా వీరవెంకటేశ్వరరావు, నయినాల రఘురామయ్య, రాయుడు శ్రీనివాస్, బాలం రామకృష్ణ, పెద్దిరాజు రాయుడు నాగేశ్వరరావు, కాగితాలపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: జ్యోతిరావుపూలే వర్ధంతిని ముమ్మిడివరం మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పోలమ్మ చెరువుగట్టున జై బుద్ధ పార్కు ఆవరణలో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బి.శరత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎం.ఆశీర్వాదం, జనిపల్లి సత్యనారాయణ, సకిలే పృథ్వీరాజ్, బొక్కా శ్రీనివాస్, నాగేశ్వరరావులతో పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పూలే విగ్రహానికి బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు విత్తనాల సత్యనారాయణ, గుత్తుల నాగేశ్వరరావు, గుత్తుల శ్రీను, యనమదల పళ్లంరాజు, చప్పిడి వెంకటనాగేశ్వరరావు, గుత్తుల బాబ్జి, చప్పిడి దుర్గారావు, చప్పిడి కిరణ్, వాసంశెట్టి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, గుత్తుల సూర్య, కట్టా బాబి, రాయుడు సత్యనారాయణ, బొంతు రామ్మోహనరావు, సత్యనారాయణ, సత్తిరెడ్డి పాల్గొన్నారు.



జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజోలు: రాజోలులో దళిత చైతన్య వేదిక కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని గురువారం నిర్వహించారు. చైతన్య వేదిక ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, రాజోలు వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఆధునిక భారతదేశ చరిత్రలో తొలిసారిగా సామాజిక కులానికి ముందడుగ వేసిన జ్యోతిరావుపూలే చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో మట్టా నరేష్, బత్తుల జనార్ధనరావు, లికితపూడి బుజ్జి, జిల్లెల్ల వినోద్, చింతా మధుకుమార్, కాకర విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వాలు వేగవంతం చేయాలి'

అంతర్వేది, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని గురువారం పరిశీలించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాలు వేగవంతం చేయాలని గ్రామశాఖ అధ్యక్షులకు సూచించారు. అంతర్వేది పల్లిపాలెంలో జరిగిన సభ్యత్వ నమోదుల్లో ఆయన పాల్గొని కార్యకర్తలతో మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామశాఖ అధ్యక్షుడు పోతాబత్తుల రాంబాబు, టీడీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం 33 కేవీ విద్యుత్ లైన్ పనులు, ఆర్‌డీఎస్‌ఎస్ పనులు చేసే నిమిత్తం నరేంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ మరమ్మతుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటలు వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవి కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఊడి మూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, గంటిపెదపూడి గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీ భవనం ఏర్పాటుకు సహకరించండి

పి.గన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరేంద్రపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు అన్నివసతులు ఉన్నాయని భవనం ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ భీమవరం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు స్థానిక బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. మండలంలోని 20 గ్రామాలకుగాను సుమారు 70వేల జనాభా ఉన్నారని నాగుల్లంకలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉందని 8 గ్రామాల ప్రజానీకానికి మాత్రమే అందుబాటులో ఉందని ఆయనకు వివరించారు. మిగిలిన 12 గ్రామాల ప్రజానీకానికి అందుబాటులో ఉండే విధంగా నరేంద్రపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం శాశ్వత భవనం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఇప్పటికే వైద్యులతోపాటు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని భవనం ఏర్పాటుచేస్తే సరిపోతుందని మంత్రికి వివరించారు. వినతి పత్రం అందించిన వారిలో చిట్టిసీడి రంగసాయి, షంసు సాదిక్, నక్కా త్రిలోచనరావు, రజా అబ్బాస్ ఉన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుడు శ్రీధర్ మృతి

అంబాజీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముక్కామల ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్(మినిమం టైమ్‌స్కేల్)లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అప్పారి శ్రీధర్ (48)బుధవారం రాత్రి మృతిచెందారు. 1998 డీఎస్సీలో ఎంటీఎస్ సెకండ్ గ్రేడ్ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా గతేడాది ఉద్యోగం లభించింది. శ్రీధర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. శ్రీధర్‌కు భార్య కుమార్తె ఉన్నారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, సీఆర్పీలు, ఉపాధ్యాయ సంఘాలు శ్రీధర్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

స్వగ్రామానికి విద్యాసాగర్ మృతదేహం

అంతర్వేది, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి గ్రామానికి చెందిన నేతల విద్యాసాగర్ ఇటీవల గల్ఫ్ దేశంలో రోడ్డు ప్రమాదంలో మరణించగా గురువారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, వైసీపీ నాయకులు, కూటమి శ్రేణులు విద్యాసాగర్ కుటుంబాన్ని పరామర్శించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, బళ్ల నోబుల్ ప్రభాకర్, ఈద రవిరెడ్డి, కుసుమ చంద్రశేఖర్, కూటమి శ్రేణులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

తుఫాన్ ప్రభావంతో అన్నదాతల ఆందోళన

అల్లవరం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రైతులు అప్రమత్తమయ్యారు. దేవగుప్తం తదితర గ్రామాల్లో గాలులకు నేలనంటిన వరిదుబ్బులను కోసి ఒబ్బిడి చేసుకుంటున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు రైతులు వరి కోతలు కోయవద్దని తహశీల్దారు వీవీఎల్ నరసింహారావు సూచించారు. పనలపై ఉన్న పంటను కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. ఓడలరేవు మొగద్వారా సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని తహశీల్దారు మత్స్యకారులకు సూచించారు. అల్లవరం తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

తుఫాన్ ప్రభావంతో రైతులు బెంబేలు

మామిడికుదురు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు సంభవించడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చే సమయంలో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో పనలమీద ఉన్న చేలను ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, వర్షం వస్తే పండిన పంట నేలనంటి అపార నష్టం సంభవించే ఆస్కారం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకాశం మేఘావృతమై వాతావరణంలో పెనుమార్పులు రావడంతో రైతులు వర్షం రాకుండా చూడాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు.

చింతలపల్లిలో రైతులకు అవగాహన

రాజోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా వచ్చే నెల 5వ తేదీ వరకు భారీ వర్షాలు, గాలలు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచన చేసిన నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని రాజోలు తహశీల్దార్ ప్రసాద్ సూచించారు. చింతలపల్లిలో రాజోలు ఏడీఏ, ఎంఏవోలు గురువారం పర్యవేక్షించి రాబోయే వర్షాల నుంచి వరి పంటలను వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంటను కోతలు కొయ్యవద్దని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. వీఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మిడివరం నగర పంచాయతీ మాస్టర్ ప్లాన్

ముమ్మిడివరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీకి సంబంధించిన 2041 డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను తుది ప్రతిపాదనను అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి గురువారం నివేదించారు. 2041 వరకు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ మాస్టర్ ప్లాన్‌పై నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ శుక్రవారం సంతకంచేసి అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి నివేదించారు. మాస్టర్‌ప్లాన్‌ను శుక్రవారం నగర పంచాయతీలో పరిశీలించారు. దీని ప్రకారం పుర ప్రజలకు బిల్డింగ్ ప్లాన్‌లు, లేఅవుట్ అనుమతులు పొందేందుకు సులభతరమవుతుంది. వారి స్థలం నిర్ధారించి నివేశిత, వాణిజ్య, పరిశ్రమల అనుమతులు మంజూరు చేస్తామన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల భవిష్యత్ కార్యాచరణ 2041 వరకు నిర్ధారణ చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సమగ్ర సర్వేచేసి రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను తుది ఆమోదానికి మున్సిపల్ కమిషనర్ పి.రవివర్మద్వారా నివేదించారు. నగర పంచాయతీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ముస్లిం నేతలు

మామిడికుదురు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎండీ షరీఫ్‌ను నగరం గ్రామానికి చెందిన ముస్లిం నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నర్సాపురంలోని చైర్మన్ స్వగృహంలో కలుసుకుని పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. మామిడికుదురులోని శిథిలస్థితికి చేరిన గోరీతో పాటు మసీదు వద్ద షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతిపత్రం ద్వారా కోరినట్టు నాయకులు తెలిపారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కలిసిన వారిలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, హుస్సేన్, అలీ, కిశ్వర్ మొహిద్దీన్ ఉన్నారు.

అరటి వర్తకుల వనసమారాధన

అంబాజీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డులో అరటి రైతులు, వర్తకులు ఆధ్వర్యంలో గురువారం వనసమారాధనను ఘనంగా నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద మర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 2వేల మందికి వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కూనవరం మేజర్ డ్రెయిన్ పూడికతీత వేగవంతం చేయాలి

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కూనవరం స్ట్రెయిట్ కట్ తిరిగి మూసుకుపోవడంతో పంటలు ముంపు బారిన పడే ప్రమాదం ఉన్నందున తక్షణం కూనవరం మేజర్ డ్రెయిన్‌మొగ దగ్గరలో పూడికతీత పనులు వేగవంతం చేయాలని ది కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు చేయని రైతులు ముంపు భయంతో నవంబరు నెల గడిచిపోయినా ఇంత వరకు రబీ నారుమడులు వేయలేకపోయారన్నారు. రబీ నారుమడులు ఆలస్యమైతే ఏప్రిల్, మే నెలల్లో వచ్చే అకాల వర్షాల వల్ల పంట నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ముంపు సమస్యపై చొరవ తీసుకుని స్ట్రెయిట్ కట్ తెరిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన పని పూర్తికాకుండానే కాంట్రాక్టరు సదరు పనిని విడిచిపెట్టి వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల బ్రహ్మానందం, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకంలో సవాళ్లను అధిగమించాలి

అమలాపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో పిల్లల పెంపకం పెను సవాల్‌గా మారిందని కార్పొరేట్ అకడమిక్ ట్రైనర్, సైకాలజిస్ట్ డాక్టర్ మాకిన సతీష్ చెప్పారు. సవాళ్లను అధిగమించి విద్యార్థుల భవిష్యత్తుకు రూపకల్పన చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కామనగరువు ఆదిత్య స్కూల్‌లో గతమూడు రోజులుగా జరుగుతున్న ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ అనే అంశంపై ముగింపు సెమినార్ గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలు ఎలక్ట్రానిక్ వస్తువులకు అలవాటు పడిపోయారని, మాట వినడంలేదని ఇలా ఎన్నో అంశాలపై తల్లిదండ్రులు సతమతమవుతున్నారని, వాటికి పరిష్కార మార్గాలను ఆయన వివరించారు. విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ వి.రాజేష్, సతీష్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, గొల్లగూడెం బ్రాంచి ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, గణితావధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సతీష్

ప్రచార కరదీపిక ఆవిష్కరణ

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సాధిస్తున్న వరుస విజయాలతో రూపొందించిన కరదీపికను డీఐఈవో వనుము సోమశేఖరరావు ఆవిష్కరించారు. అమలాపురంలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇదే కళాశాలలో జరిగిన విద్యార్థిని పడగ కృష్ణసత్యశ్రీబిందు తిరుపతిలో కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో పశువైద్యంకోర్సుకు ఎంపికైందన్నారు. గత మూడేళ్లుగా దేశంలోని ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరిన మహిళా కళాశాల విద్యార్థినుల ప్రగతిని ప్రిన్సిపాల్ కడియం శిరీష వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

'తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేయాలి'

ముమ్మిడివరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబరు 7న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు ఏర్పాటుచేయాలని ఎంఈవోలు బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కరరావు సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లను ఆహ్వానించి సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశాల నిర్వహణకు సంబంధించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరి జయంతి


ఆలయంలో వ్రతం చేస్తున్న దృశ్యం

ఆలమూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత ధన్వంతరి జయంతి సందర్భంగా చింతలూరులోని ధన్వంతరి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం డైరెక్టర్ ద్విభాష్యం వెంకట సూర్యసుజన్ దంపతులచే ధన్వంతరి వ్రతాన్ని పండితులు జరిపించారు. ధన్వంతరి జయంతి సందర్భంగా స్వామివారిని పలు ప్రాంతాల భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు.

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. నోము ఆచరిస్తున్న భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,92,135 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన గంగిన వెంకట సత్యనారాయణ రూ.1,00,116 విరాళం అందించారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.


విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు మెర్లపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని రంకిరెడ్డి కల్యాణి రేవతి ఎంపికైంది. ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని కల్యాణి రేవతి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. వచ్చేనెల 11 నుంచి 15 వరకు పంజాబ్‌లోని లూథియానాలో జరగనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనుంది. ఎంపికైన రేవతిని సర్పంచ్ మెర్ల రాము, హైస్కూల్ కమిటీ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ, హెచ్ఎం శ్రీహరి, పీడీ శ్రీకాంత్ తదితరులు అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఎంఏ షరీఫ్‌ను కలసిన మైనార్టీ నాయకులు

ద్రాక్షారామ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన ఎంఏ షరీఫ్‌ను గురువారం రామచంద్రపురం నియోజకవర్గ మైనార్టీ నాయకులు కలిశారు. నరసాపురంలో ఆయన్ను రామచంద్రపురానికి చెందిన న్యాయవాది సయ్యద్ అహ్మద్, వక్ఫ్ బోర్డు కమిటీ మాజీ కార్యదర్శి ఎండీ జాఫర్‌లు కలసి అభినందనలు తెలిపారు.

మండపేట: మైనార్టీ కమిటీ రాష్ట్ర సలహాదారుడిగా నియమితులైన షరీఫ్‌ను గురువారం పట్టణానికి చెందిన మైనార్టీ సెల్ నాయకులు నరసాపురంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో మైనార్టీ సంఘ నాయకులు షేక్ ఇబ్రహీం, షేక్ ఖరీం, సల్మాన్ హుస్సేన్ తదితరులున్నారు.


షరీఫ్‌ను కలిసిన మండపేట మైనార్టీ సెల్ నేతలు


ద్వారపూడి కెనాల్ రోడ్డులో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కోళ్లఫారం షెడ్లు

కోళ్లఫారం నిర్మాణంపై స్థానికుల ఆగ్రహం

మండపేట నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి కెనాల్ రోడ్డులో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కోళ్లఫారం షెడ్డులను నిర్మించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుడా అనుమతి లేకుండానే షెడ్డులను నిర్మించడంపై ఇప్పటికే స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో కొంతకాలం వీటి నిర్మాణం నిలిపివేసి ఇప్పుడు మళ్లీ నిర్మాణాలు చేయడంపై ద్వారపూడి వాసులు మరోసారి పోరుకు సిద్ధపడుతున్నారు. కెనాల్ రోడ్డులో ఆంధ్ర శబరిమలై ఆలయ ప్రాంగణం ఉండటంతోపాటు కల్యాణ మండపం, గ్రామం ఉండటం వల్ల వాటి నుంచి వచ్చే దుర్వాసన భరించలేమని వాపోతున్నారు. ఇప్పటికే ద్వారపూడి గ్రావెల్ పరిశ్రమల కారణంగా కాలుష్యం బారినపడ్డామన్నారు. కోళ్లఫారం షెడ్లపై పంచాయతీ కార్యదర్శి ఎవీవీ రమణను వివరణ కోరగా ప్రభుత్వ అనుమతులు లేవన్నారు. నిర్మాణం పనులు నిలిపివేయమని వాటి యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు.

అంగరలో ఉచిత వైద్య శిబిరం


అంగరలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీ ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రత్యేక బ్లాక్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిపారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ మండపేట యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 176 మందికి పరీక్షలు జరిపి చికిత్స అందించారు. రాజమహేంద్రవరానికి సంబంధించి డాక్టర్ శ్రీలేఖ, శ్రీ సాయిరాం డెంటల్ హాస్పిటల్, ఇంప్లాంట్ సెంటర్ డాక్టర్ ఎస్. విజయ, అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యులు యశ్వంత్, పల్స్ కార్డియాక్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు అవసరం అయిన వారికి చేశారు. శిబిరంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, వైద్యాధికారి డాక్టర్ రత్నకుమారి, ఈవోపీఆర్డీ ఆర్.మోహన్, ఏపీఎన్జీజీవో అసోసియేషన్ మండపేట యూనిట్ అధ్యక్షుడు జె.మల్లిఖార్జునుడు, ఉపాధ్యక్షుడు సుధాకర్, డీసీ మెంబరు ఇమ్మానుయేల్, యూటీఎఫ్ నాయకులు సురేంద్ర, సూరిబాబు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థిని గెలిపించండి

కె.గంగవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి విజయానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కె.గంగవరంలో ఉన్నత పాఠశాలలో ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సంఘ నాయకులు ఎం.ప్రదీప్, డి.శ్రీనివాసు, పి.గుణవంతుడు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పీవీ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ ఎక్కువ రోజులు జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించాలని సీహెచ్‌వో బి.అప్పారావు సూచించారు. మాచవరం కుమ్మరివారి వీధిలో గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలు వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రమాదం జరిగితేగానీ పట్టించుకోరా?

• చేతికి అందే ఎత్తులో కరెంట్ తీగలు • చోద్యం చూస్తున్న విద్యుత్‌శాఖ

కొత్తపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా కొత్తపేట, సమీప ప్రాంతాల వీధుల్లో కరెంట్ తీగలు చేతికి అందేలా వేలాడుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈదురు గాలులు వీచినప్పుడల్లా అవి ఊగుతుండటంతో పాటు కొన్నిచోట్ల తెగిపడిన సందర్భాలున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యుత్‌శాఖ సిబ్బంది తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. లూజ్ ప్యానల్స్‌ను సెట్ చేయకుండా ప్రమాదం జరిగే సమయంలో హడావుడి చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన వీధుల్లో సైతం విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుపోవడం, కొబ్బరి ఆకులు కరెంట్ తీగలపై వేలాడుతున్నా ఆ శాఖ సిబ్బంది చోద్యం చూస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట పాత రామాలయం వీధి, కెనాల్ రోడ్డుల్లో కరెంట్ తీగలు చేతికి అందేలా వేలాడుతూ ప్రమాదభరితంగా ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుని లూజ్ ప్యానల్స్ ఉన్న చోట్ల స్తంభాలు వేసి విద్యుత్ లైన్‌ను సరిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పాత రామాలయం వీధిలో వేలాడుతున్న కరెంట్ తీగలు


చంద్రబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు

రామ్మూర్తి నాయుడు కుటుంబానికి నేతల పరామర్శ

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు పెద్దకర్మ కార్యక్రమానికి మండపేట, అనపర్తి, పెద్దాపురం ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నిమ్మకాయల రాజప్ప, జడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్, రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులు వారు పరామర్శించారు.


యండగండిలో ధాన్యం పరిశీలిస్తున్న ఏవో రవి

ధాన్యం రక్షణకు చర్యలు తీసుకోండి

కె.గంగవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తక్కువే అయినా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి అన్నారు. గురువారం ఆయన యండగండిలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. తుఫాన్ ప్రభావం మన ప్రాంతానికి తక్కువేనని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. టార్పాలిన్‌లు వేసుకుని పంటను రక్షించుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట వీఏఏ లావణ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది కోట మమత, పెందుర్తి సుజాత ఉన్నారు.

పూలే ఆశయసాధనకు కృషి చేద్దాం

ద్రాక్షారామ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పూలే ఆశయసాధనకు కృషి చేద్దామని పలువురు కూటమి నాయకులన్నారు. గురువారం ద్రాక్షారామలో జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకుని పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు నివాళర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు దంగేటి గౌరీశంకర్, అల్లం శ్రీనివాస్, టీడీపీ నాయకులు పెంకె సాంబశివరావు, పితాని వీరభద్రరావు, జనసేన నాయకులు ముప్పనపల్లి గణేష్, కె.రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీసీ సేన అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాట్ల రోజారాణి, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో: రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కంచుమర్తి బాబూరావు తదితరులు నివాళులర్పించారు. అధిక సంఖ్యలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని పెద్దకాల్వ వంతెన వద్ద వున్న పూలే విగ్రహానికి బీసీ సంఘ నాయకులు నివాళులర్పించారు. బీసీ సంఘ పట్టణ అధ్యక్షుడు మల్లువలస గణపతి, బీసీ సంఘ నాయకులు పూలే సేవలను కొనియాడారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంఘ భవనం వద్ద పూలే వర్ధంతిని జరిపారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు దూళి జయ రాజు తదితరులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

కొత్తపేట: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా వాడపాలెంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, బూసి భాస్కరరావు, యల్లమిల్లి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వరరావు

వెలుగు ఇన్‌చార్జ్ ఏపీయంగా నాగేశ్వరరావు

రాయవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాయవరం వెలుగు కార్యాలయం ఇన్‌చార్జ్ ఏపీయంగా కె.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అమలాపురం డీఆర్‌డీఏ కార్యాలయం ఇన్‌చార్జ్ ఏపీయంగా పనిచేస్తున్న ఈయన బదిలీపై రాయవరం ఇన్‌చార్జ్ ఏపీయంగా బాధ్యతలు చేపట్టారు. రాయవరం కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏపీయంగా పనిచేస్తున్న నాజర్ హుస్సేన్ రాయవరం వెలుగు కార్యాలయంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా కొనసాగనున్నారు. బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావును పలువురు సిబ్బంది, యానిమేటర్లు అభినందించారు.



విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న రూరల్ సీఐ దొరైరాజు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండపేట రూరల్ సీఐ పి.దొరైరాజు అన్నారు. తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం జరిపిన ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొని ట్రాఫిక్ నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులను సీఐ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, రాయవరం ఎస్ఐ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన


వెంకటాయపాలెంలో ఉసిరి చెట్టు వద్ద పూజలు

ద్రాక్షారామ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో రామచంద్రపురం మండల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీపీ, జడ్పీటీసీల కార్తీక వనసమారాధన జరిపారు. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కార్తీకవన సమారాధనలో పాల్గొన్నారు. ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం ఆటపాటల్లో పాల్గొన్నారు. అంతా కలసి వనభోజనాలు చేశారు. వెంకటాయపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కె.రాజేశ్వరి జన్మదినం కావడంతో కేకు కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాకాబాబీ, జడ్పీటీసీ సభ్యులు మేర్నీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ అంబటి తుకారాం, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామంలోనున్న శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం కార్తీక వనసమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులు ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. కొన్నేళ్ళుగా ఆలయం వద్ద కార్తీక మాసంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, సుంకర బుజ్జి, కాకులపాటి సుబ్రహ్మణ్యం, పెద్దిరెడ్డి దొరబాబు, సుంకర శ్రీను, ఆచంట వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మండపేట: మండపేట మండలం వేములపల్లిలో ఉన్న శ్రీకృష్ణసాయి మందిరం నిర్వాహకుల ఆధ్వర్య ంలో గురువారం 22వ కార్తీక వన సమారా ధన జరిపారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారా ధన జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

రావులపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం ఈతకోట నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకులు కేవీకే రాజు జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు బహుమతులు, ప్రశంసపత్రాలు అందచేశారు. ప్లాంట్ హెడ్ డీపీ కుమార్, హెచ్‌పీడీ హెడ్ పి.సుభాకర్‌ల ఆధ్వర్యంలో నాగార్జున సంస్థ వ్యవస్థాపకుడు కేవీకే రాజు 97వ జయంతిని ప్లాంట్‌లో నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కేవీకే రాజు జయంతిని పురస్కరించుకుని ఈతకోట, పలివెల, గంటి పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు జరిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంస పత్రాలను అందించారు. అలాగే 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు బహుమతులను అం దించారు. సంస్థలో 30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి అవార్డులు, సత్కారాలు చేశా రు. కార్యక్రమంలో మెటీరియల్ హెడ్ ఎస్.శ్రీనివాసరాజు, క్వాలిటీ హెడ్ కె.మూర్తి, ఫైనాన్స్ హెడ్ సత్యనారాయణ, మెయింటెనెన్స్ హెడ్ ఏ.శ్రీనివాస్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధివినాయకుడి ఆలయం కిటకిట

అయినవిల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం త్రయోదశి సందర్భంగా గురువారం ఆలయాలు కిటకిటలాడాయి. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయం, ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణ ముక్తీశ్వరాలయం, శ్రీరాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.



ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురిపై కేసులు నమోదు

ఆలమూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. చెముడులంక గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న నాగిరెడ్డి మల్లయ్య వద్ద 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. ద్వారపూడిలో మట్టా వెంకటలక్ష్మి, కేశవరంలో గుండిమేని త్రివేణి నాటుసారా అమ్మకాలు చేస్తుండగా జరిపిన దాడుల్లో వారి నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసులు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

నేడు వెదురుపాకలో సాయి సత్య వ్రతాలు

రాయవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గ్రామంలో శుక్రవారం సాయిసత్య వ్రతాలు నిర్వహించనున్నట్టు బండారు వెంకటరమణ గురుస్వామి తెలిపారు. వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ బండారు సుబ్బారావు, చంద్రమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు సాయిబాబాకు కాకడాహారతి, సుప్రభాతం, అభిషేకాలు జరుపుతారు. ఉదయం 8 గంటల నుంచి ఉచిత సామూహిక సత్యసాయి వ్రతాలు, నిత్య ప్రార్థన, సాయిబాబాకు గ్రామోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి జరుపనున్నట్టు వారు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షకు హాజరుకండి

కొత్తపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 1న నిర్వహించే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) నమూనా పరీక్షకు విద్యార్థులు హాజరుకావాలని పాఠశాల హెచ్ఎం ఏ.వెంకటేశ్వరరావు కోరారు. డిసెంబరు 8న రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని నిర్వహిస్తారని తెలిపారు. దీనిలో పాల్గొనే విద్యార్థులు ముందుగా జడ్పీ ఉన్నత పాఠశాల కొత్తపాలెం, వానపల్లిలో ఉదయం 10 గంటలకు నమూనా పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను నమూనా పరీక్షలో తెలుసుకుని 8న జరిగే పరీక్షకు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎండీయూ ఆపరేటర్ కుటుంబానికి గురువారం ఆర్థికసాయం అందించారు. మాచవరం గ్రామానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ పలివెల సతీష్ 16న గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబానికి ఎండీయూ ఆపరేటర్ల సంఘ సభ్యుల నుంచి సేకరించిన 53వేలను సంఘం మండల అధ్యక్షుడు రాయుడు నాగ మురళి ఆధ్వర్యంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రామదాసు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గెద్దాడ లోవరాజు, కాదా నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ


ఆలమూరులో అయ్యప్పపడి జరుపుతున్న దృశ్యం

ఆలమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):ఆలమూరులో అయ్యప్పస్వామి పడిపూజను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలమూరు శ్రీనివాసానగర్‌లో మణుగుల బాబ్జి కృష్ణవేణి దంపతులతో ఏర్పాటు చేసిన పడిపూజలో అరటి డొప్పలు, పువ్వులు, పండ్లతో చేసిన వేదిక ఆకట్టుకుంది. అంగర వేణుగోపాలాచార్యులు, అంగర శింగుబాబు ఈ పడిపూజను ఘనంగా జరిపారు. అయ్యప్ప భక్తుల శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

జనసేనలో పలువురు చేరిక

ఆలమూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంకలో పలువురు నాయకులు గురువారం కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేశారు. గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు అధ్వర్యంలో గ్రామానికి చెందిన అడబాల శ్రీనివాసు, పామర్తి పేరయ్య, కెవీఎం.కేరి మాస్టర్‌లకు పార్టీ కండువా వేసి స్వాగతించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అడబాల మాచరయ్య, అడబాల వీర్రాజు, తమ్మన ఏసు, నాగిరెడ్డి శ్రీనివాస్ అడబాల సూర్యనారాయణ, తిర్నాతి శ్రీనివాస్, మద్దిరెడ్డి వెంకన్నబాబు, అడబాల ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.